సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 18 । ఆగస్టు । 2025



నేడు 'పరిష్కార వేదిక'
కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.



టమాట కిలో రూ.42
అనంతపురం మండలం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.42, కనిష్టం రూ.32, సరాసరి రూ.24 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.0°/20.0°
జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

22 మండలాల్లో వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో జిల్లాలోని 22 మండలాల్లో వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు గోరంట్లలో 18.2 మి.మీ, నల్లచెరువులో 11.2, ఓడీచెరువులో 10.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక సోమందేపల్లిలో 9.2, అమడగూరులో 5.6, పరిగిలో 5.4, తనకల్లులో 5.4, ధర్మవరంలో 5.2, పెనుకొండలో 5.2, చిలమత్తూరులో 4.8, మడకశిరలో 3.6, పుట్టపర్తిలో 3.6, గుడిబండలో 3.2, గాండ్లపెంటలో 2.6, తలుపులలో 2.4, కనగానపల్లిలో2.2, కదిరిలో 2.2, లేపాక్షిలో 2, కొత్తచెరువులో 1.8, ఎన్‌పీ కుంటలో 1.6, బత్తలపల్లిలో 1.2, అమరాపురంలో 1.2 మి.మీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ జడి వాన పట్టుకుంది.

ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు. ధర్మవరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం 31 మంది లబ్ధిదారులకు రూ.15,13,747 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కేంద్ర నిఘా సంస్థల ఆధారాలు, స్థానిక పోలీసుల అప్రమత్తతతో ఉగ్రవాద సంబంధాలున్న వ్యక్తిని అరెస్టు చేశారన్నారు. ధర్మవరంలో ప్రశాంతతను చెడగొట్టి అలజడులు సృష్టించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కుట్రలను సహించబోమని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉగ్రవాద మద్దతుదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అలజడులకు తావివ్వకూడదని సూచించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు అధికారిక నిఘా సంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయన్నారు.

మేరెడ్డిపల్లిలో సంస్కృత శాసనం గుర్తింపు



గుడిలో గుర్తించిన సంస్కృత శాసనం

గోరంట్ల: మేరెడ్డిపల్లిలోని వేణుగోపాలస్వామి గుడిలో సంస్కృత శాసనాన్ని గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం మీడియాకు వెల్లడించారు. విజయనగర సామ్రాజ్య తొలినాళ్లకు చెందిన వేణుగోపాలస్వామి సన్నిధి ముఖ మండపంలో నాలుగు స్తంభాలు శిల్పాలంకృతమై ఉన్నాయి. అందులో ఎడమవైపున మొదటి స్తంభంలో నరసింహస్వామి శిల్పం కూర్చున్న విధంగా మలిచారు. కింది వైపున శ్రీమహా విష్ణువు శంఖు చక్ర గదాధారుడై నిల్చుని భక్తులకు అభయమిస్తున్నాడు. నరసింహ- విష్ణువు శిల్పాల మధ్య ఒక స్తంభంలో 'శ్రీ గోపాలకృష్ణాయ నమః శ్రీ' అనే ఏకవాక్య సంస్కృత శాసనాన్ని గుర్తించారు. శాసనం నంది నాగరి లిపిలో ఉంది. శాసన లిపిని బట్టి సంగమ వంశానికి చెందిన ఒకటో దేవరాయలు లేదా రెండో దేవరాయలుకు సంబంధించిన శాసనమై ఉండవచ్చని మైనాస్వామి పేర్కొన్నారు. మేరెడ్డిపల్లి చెరువు నిర్మాణం, నీటి సరఫరా కాలువ తవ్వకం పనులను రెండో బుక్కరాయల శాసనం వివరిస్తోందన్నారు. అచ్చ తెలుగు శాసనం కరావులపల్లి సుభాష్ పొలం గట్టున ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉందన్నారు. ఆ శాసన బండను పురావస్తు శాఖ ప్రదర్శనశాలకు తరలించి భద్రపరచాలని కోరారు.

మారిస్తే మహా ఉద్యమమే!

- జిల్లా కేంద్రం మార్పుపై చర్చ
- జిల్లా కేంద్రంగా హిందూపురం అంటూ మీడియాకు లీకులు
- సత్యసాయి నడయాడిన పుట్టపర్తికి జగన్ హయాంలో గుర్తింపు
- మార్పు చేస్తే ఉద్యమిస్తామంటున్న మేధావులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు
- పుట్టపర్తి కేంద్రంగా జిల్లాను యథాతథంగా ఉంచాల్సిందేనని ముక్తకంఠంతో డిమాండ్



పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం

పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం జిల్లాల పునర్విభజనకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో కొత్తగా జిల్లాలు ఏర్పాటవుతుండగా.. మరికొన్ని జిల్లా కేంద్రాలు మారబోతున్నట్లు సంకేతాలు ఉన్నాయి. ఇందులో భాగంగానే శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తిని కాకుండా బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం చేయాలన్న యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అనువుగాని చోట జిల్లా కేంద్రం ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్న చర్యలను మేధావులు, ఉద్యోగ సంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఇది సరైన నిర్ణయం కాబోదని స్పష్టం చేస్తున్నారు. కాదని జిల్లా కేంద్రం మార్పు చేస్తే ఐక్య ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

నాడు అచితూచి ఎంపిక..

హిందూపురం పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు పరిపాలనా సౌలభ్యం కోసం పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో ఏర్పాటు చేసింది. పుట్టపర్తిని ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిపి.. విద్య, వైద్యం, తాగునీరు తదితర సేవా కార్యక్రమాలతో ప్రజలకు విశేష సేవలందించిన శ్రీసత్యసాయి పేరుతో జిల్లా ఏర్పాటు చేసి సముచిత గౌరవం కల్పించింది. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టుకు చెందిన భవనాలు ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. అలా మూడు సంవత్సరాలకు పైగా పరిపాలన సాఫీగా సాగుతూ వస్తోంది.

నేడు జిల్లా కేంద్రం మార్పునకు కుట్ర!

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిపై ఎటువంటి వ్యతిరేకత లేదు. ఎవ్వరి నుంచి కూడా అభ్యంతరాలు లేవు. అయినా కూటమి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాల కోసం పుట్టపర్తి స్థానంలో హిందూపురం కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను మార్పు చేయాలనే కుట్ర జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలలుగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మీడియాకు, పత్రికలకు లీకులిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సువిశాలమైన భవనాలు.. ప్రశాంత వాతావరణంలో పాలనకు అనువుగా ఉన్న ప్రాంతాన్ని కాదని మరొక ప్రాంతానికి మార్పు చేయాలన్న ప్రతిపాదనను సత్యసాయి భక్తులు, మేధావులు, ఉద్యోగ, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు కోసం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

ప్రతిఘటన తప్పదు



భగవాన్ సత్యసాయి బాబా నడయాడిన పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను గత వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. హిందూపురం పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు ఎంతో అనుకూలంగా ఉంది. ఉన్నపళంగా జిల్లా కేంద్రం మార్పు చేయాలనుకోవడం సరైనది కాదు. ప్రజాభిప్రాయం మేరకు జిల్లా కేంద్రాన్ని యథాతథంగా ఉంచాలి. అలా కాదని హిందూపురం కేంద్రంగా మార్పు చేస్తే అన్ని పార్టీలతో కలిసి ఉద్యమం చేపడతాం. కూటమి ప్రభుత్వానికి ప్రజా ప్రతిఘటన తప్పదు. జిల్లా కేంద్రంగా పుట్టపర్తి తరలిపోకుండా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కూడా చొరవ చూపాలి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పుట్టపర్తి

మార్పు తగదు



పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని గతంలో సత్యసాయిబాబా సోదరుడు ఆర్.వి.జానకిరామయ్య ఎంతో కృషి చేశారు. ఆయన ఆశయం నెరవేరుస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేసింది. దీంతో పుట్టపర్తి కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేసినట్లయ్యింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే బాలకృష్ణ మెప్పు కోసం హిందూపురం కేంద్రంగా జిల్లాను మార్పు చేయాలని ప్రతిపాదనలు తయారు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే పుట్టపర్తి అభివృద్ధి జరుగుతోంది. ఇలాంటి సమయంలో మార్పు చేయడం ఎంతమాత్రమూ తగదు. ఊహాగానాల ప్రకారం జిల్లా కేంద్రాన్ని మారిస్తే ఆందోళన తప్పదు.

– కోటా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్

ఆ ఆలోచన సరికాదు



జిల్లాల పునర్విభజనలో పుట్టపర్తికి బదులు హిందూపురం కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పాలన పరంగా, జిల్లా కేంద్రంగా పుట్టపర్తి ఎంతో అనువుగా ఉంది. అనవసరంగా మరొక ప్రాంతాన్ని జిల్లా కేంద్రంగా మార్పు చేయాలన్న ఆలోచనను ప్రభుత్వ పెద్దలు ఉపసంహరించుకోవాలి. ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అసంబద్ధ నిర్ణయాలతో జిల్లా కేంద్రాన్ని మార్పు చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– లింగా రామమోహన్ చౌదరి, జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నేత, పుట్టపర్తి

పుట్టపర్తి స్థాయి పెంచాలి



కూటమి ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటు.. కొన్ని జిల్లా కేంద్రాల మార్పు అంశాలపై కసరత్తు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తికి బదులు హిందూపురం చేయబోతున్నట్లు వస్తున్న ప్రచారం ఇక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు జిల్లా కేంద్రంగా పుట్టపర్తి బాగుందని, ప్రభుత్వ కార్యాలయ భవనాలు అద్భుతంగా ఉన్నాయని భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 'మార్పు' నిర్ణయం ఎంతమాత్రమూ సముచితం కాదు. జిల్లా కేంద్రంగా పుట్టపర్తిని కొనసాగించి.. స్థాయి పెరిగేలా మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్నాం. లేని పక్షంలో ఉద్యమాలకు సిద్ధం.

– పీవీ రమణారెడ్డి వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు, పుట్టపర్తి

కాలుష్య కోరల్లో పల్లెలు

ప్రశాంతతకు, పచ్చదనానికి, ప్రకృతి సోయగాలకు ఆలవాలమైన పల్లెలు నేడు కాలుష్య కాసారాలతో నిండి ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం శ్రీవెన్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ ఫ్యాక్టరీ. మెడికల్ వేస్ట్‌ను కాల్చి బూడిద చేసే ఈ పరిశ్రమ ఎక్కడో నిర్మానుష్య ప్రాంతంలో జనావాసాలకు దూరంగా ఉండాల్సింది పోయి పచ్చని పల్లెలకు సమీపంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని బత్తలపల్లి మండలంలో ఈ పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

- మెడికల్ వేస్ట్‌తో భరించలేని దుర్వాసన
- తీవ్ర ఇబ్బందుల్లో పలు గ్రామాల ప్రజలు
- గత ప్రభుత్వంలో పరిశ్రమ మూసివేయించిన అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ మొదలైన పనులు
- ఇదీ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో దుస్థితి



'శ్రీవెన్' పరిశ్రమలో ప్రాసెసింగ్ కోసం ఉంచిన మెడికల్ వేస్ట్ బాక్సులు



శ్రీవెన్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీస్ ఫ్యాక్టరీ

ధర్మవరం: బత్తలపల్లి మండలం డీ చెర్లోపల్లి, రామాంజులపల్లి గ్రామాలకు చేరువలో చెన్నై రహదారికి కూతవేటు దూరంలో శ్రీవెన్ పరిశ్రమ నిర్వహిస్తున్నారు. ఇందులో మెడికల్ వేస్ట్‌ను కాల్చి బూడిద చేస్తున్నారు. ఇక్కడికి అనంతపురం, కడప సర్వజనాస్పత్రుల నుంచి వచ్చిన వైద్య వ్యర్థాలను తీసుకొస్తుంటారు. ఉదయం నుంచి అర్ధరాత్రి దాకా పరిశ్రమలో వ్యర్థాలను కాల్చి బూడిద చేసే క్రమంలో పరిసర పల్లెల్లో భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఫలితంగా వాయు కాలుష్యం పెచ్చుమీరి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, అలర్జీలతో ప్రజలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా ఫ్యాక్టరీ చేరువలో ఉన్న డీ చెర్లోపల్లి, డీ చెర్లోపల్లి ఎస్సీ కాలనీ, దంపెట్ల, కట్టకిందపల్లి, సూర్యచంద్రాపురం, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీ సమీపంలోని పొలాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు కూడా కూలీలు రాని దుర్భర పరిస్థితి నెలకొంది.

నిబంధనలు బేఖాతర్

ప్రజల ఆరోగ్యానికి నష్టం కల్గించే ఇటువంటి పరిశ్రమలను జనావాసాలకు దగ్గరలో నిర్వహించరాదు. అయినప్పటికీ ఈ పరిశ్రమను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారు. అంతేకాక ఏరోజు వ్యర్థాలను ఆరోజు ప్రాసెస్ చేయకుండా రోజుల తరబడి నిల్వ ఉంచడం కూడా సమీప ప్రాంతాల వారికి అనారోగ్యాన్ని కల్గిస్తోంది. వాస్తవంగా అయితే ఈ ఫ్యాక్టరీలో మెడికల్ వేస్ట్‌ను 900 డిగ్రీల ఉష్ణోగ్రతలో కాల్చి బూడిద చేయాలి. కానీ అలాంటి ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో గాలి కాలుష్యం పెరిగి దుర్గంధం వెదజల్లుతోందని పలువురు నిపుణులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో రీ– ఓపెన్

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే శ్రీవెన్ ఫ్యాక్టరీని ఆగమేఘాల మీద రీ ఓపెన్ చేయించారు. దీంతో సదరు కంపెనీ ప్రతినిధులు ఇష్టారాజ్యంగా మెడీవేస్ట్‌ను కాల్చి బూడిద చేస్తూ గాలిని విషతుల్యం చేస్తున్నా ప్రజల గోడు పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఫ్యాక్టరీ రీ ఓపెన్ విషయంలో ప్రభుత్వ పెద్దలకు భారీగానే ముడుపులు అందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఫ్యాక్టరీని మూసివేసి నిర్మానుష్య ప్రదేశంలో నిర్వహించాలని బత్తలపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

గతంలో ఫ్యాక్టరీని మూసివేయించిన కేతిరెడ్డి



పరిశ్రమలో కాలుష్యం గురించి చెబుతూ చర్యలు చేపట్టాలని ఆదేశిస్తున్న అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి (ఫైల్)

శ్రీవెన్ ఫ్యాక్టరీ వల్ల వచ్చే కాలుష్య కారకాల గురించి బాధిత గ్రామాల ప్రజలు గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కేతిరెడ్డి ఫ్యాక్టరీని తనిఖీ చేశారు. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని 2022లో ఫ్యాక్టరీని మూసివేయించారు. అప్పటి నుంచి ప్రజలు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జీవనం సాగించారు.

ఇబ్బందులు పడుతున్నాం



శ్రీవెన్ ఫ్యాక్టరీలో వ్యర్థాలను కాల్చుతున్నప్పుడు భరించలేని వాసన వస్తోంది. ఆ దుర్వాసన మొట్టమొదట డీ చెర్లోపల్లి ఎస్సీ కాలనీ వాసులపై ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఇప్పటికే కాలనీలో చాలా మంది ఊపిరితిత్తుల సమస్యలు, అలర్జీలతో బాధపడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీని ఇక్కడ లేకుండా చేయాలి.

– తిరుపాల్, డీచెర్లోపల్లి, ఎస్సీ కాలనీ, బత్తలపల్లి మండలం

కూలి పనులకు రావడం లేదు



మా పొలం శ్రీవెన్ ఫ్యాక్టరీ సమీపంలో ఉంది. రోజువారీ వ్యవసాయ పనులు చేసేందుకు కూలీలు కూడా మా పొలంలోకి రావడం లేదు. ఎందుకంటే భరించలేని దుర్వాసన వస్తుండటంతో పొలంలో ఎక్కువసేపు ఉంటే అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం ఫ్యాక్టరీని మూసివేయించాలి. లేకపోతే గ్రామం వదిలి వెళ్లడం తప్ప గత్యంతరం లేదు.

– రామ్మోహన్, డీ చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం

ఉచిత ప్రయాణానికి షరతులా..?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ధ్వజం



ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటూనే షరతులు విధించడం సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే అక్కచెల్లెమ్మలకు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటిన తర్వాత పథకం అమలుకు ఉపక్రమించి.. దానికి అనేక కొర్రీలు వేయడం ఏంటని నిలదీశారు. నాడు ఏ బస్సు అయినా అని చెప్పి.. ఇప్పుడు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల వరకే పరిమితం చేశారని విమర్శించారు. పేదింటి మహిళలు నాన్ స్టాప్, ఇంద్ర, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్ తదితర బస్సుల్లో ప్రయాణించేందుకు అర్హత లేదా అని ప్రశ్నించారు. రాత్రి పూట తిరిగే దూర ప్రాంత సర్వీసులకు ఉచిత ప్రయాణం వర్తింపజేయాలని కోరారు. నాన్ స్టాప్ బస్సుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకే వెళ్లలేని పరిస్థితులు కల్పించారని, ఇక రాష్ట్రం అంతా ఎలా ప్రయాణించగలరని ఎద్దేవా చేశారు. ఉచిత ప్రయాణం కొన్ని బస్సులకే పరిమితం చేస్తే.. రద్దీ కారణంగా గొడవలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. షరతులు లేని ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు.

మొబైల్ రిపేరీపై శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: మొబైల్ ఫోన్ల రిపేరీపై అనంతపురం సమీపంలోని ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నైపుణ్యతతో కూడిన శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 40 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి, 5వ తరగతి పాసైన వారు అర్హులు. 45 రోజుల శిక్షణా కాలంలో ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుంది. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా టూల్‌కిట్ అందించి, వంద శాతం ఉపాధి దక్కేలా చర్యలు తీసుకుంటారు. మరిన్ని వివరాలకు ఆర్డీటీ క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో కానీ, 88855 42201, 77807 52418 నంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చు.

కమనీయం.. రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు చేశారు. విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాక, పొరుగున ఉన్న కర్ణాటక నుంచి ముందు రోజే వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రమయ్యాయి. భక్తులకు స్థానికులు సునీత, శివారెడ్డి ఆధ్వర్యంలో అన్న దానం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని రథంపైకి చేర్చి.. గోవింద నామ స్మరణతో భక్తులు ముందుకు లాగారు. రాత్రి 7 గంటలకు నిర్వహించిన లంకాదహనం కార్యక్రమం అలరించింది. పూజల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఈఓ నరసింహారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న నేమకల్లు ఆంజనేయస్వామి



మహిళా వలస కూలీ బలవన్మరణం

ముదిగుబ్బ: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మహారాష్ట్రకు చెందిన రమేష్ సుధీర్ కడ్కర్, మీమా కడ్కర్ (18) దంపతులు బతుకు తెరువు కోసం వలస వచ్చి ముదిగుబ్బ మండలం యాకర్లకుంటపల్లిలో స్థిరపడి బొగ్గులు కాల్చే పనితో జీవనం సాగిస్తున్నారు. సెల్‌ఫోన్ విషయంగా ఆదివారం దంపతులు మధ్య గొడవ చోటు చేసుకుంది. అనంతరం భర్త పనికి వెళ్లాడు. ఆ సమయంలో మీమా కడ్కర్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కాగా, ఆరు నెలల క్రితమే వీరికి వివాహమైనట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

• పదాలు అవసరం లేదు.. ఒక్క ఫొటో చాలు!

ఒక్క ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు కదులాడుతాయి. కాలం గిర్రున తిరుగుతున్నప్పటికీ ఫొటో చూడగానే నాటి స్మృతులు మనసులో మెదలుతాయి. సంతోషం.. బాధ.. మధుర ఘట్టాలు.. సాధించిన విజయాలు.. అద్భుత సన్నివేశాలు.. కాలానుగుణంగా ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులను బంధించి పదిలంగా దాచుకొని మళ్లీ మళ్లీ చూసుకునే అవకాశం ఒక్క ఫొటోతోనే సాధ్యం. మనసులోని భావాలను పలికించడానికి.. ప్రకృతి అందాలను బంధించడానికి.. హృదయాంతరాల్లోని ఆర్ధ్రతను చూపించడానికి.. ప్రజల ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడానికి పదాలు అవసరం లేదు. ఒక్క చిత్రం చాలు. ఇలాంటి అద్భుతాన్ని ఆవిష్కరించిన లూయిస్ డాగురే జ్ఞాపకార్థం ఏటా ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొన్ని చిత్రాలు మీకోసం.. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం


తరగని అభిమానం: కట్టకిందపల్లిలో వైఎస్సార్ చిత్రపటాన్ని పెట్టుకుని పనుల్లో నిమగ్నమైన కూలీలు


శ్రమయేవ జయతే: లింగంపల్లి వద్ద కలుపు తీత పనుల్లో నిమగ్నమైన రైతులు


ప్రకృతి తోరణం: గార్లదిన్నె - పెనకచెర్ల గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు


బతుకు పోరు: అనంతపురంలోని హోటళ్లకు నీటిని సరఫరా చేస్తున్న మహిళ

పెనుకొండ రెవెన్యూ ఉద్యోగుల జట్టు విజయం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పెనుకొండ రూరల్: కొద్ది రోజులుగా కియా ట్రైనింగ్ సెంటర్ వద్ద జరుగుతున్న జిల్లా రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో కదిరి రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల జట్టుతో పెనుకొండ రెవెన్యూ డివిజన్ ఉద్యోగుల జట్టు తలపడింది. నిర్ణీత 20 ఓవర్లకు గాను కదిరి జట్టు 6 వికెట్లు నష్టపోయి 133 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన పెనుకొండ జట్టు 18 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 136 పరుగులు సాధించి విజయ కేతనం ఎగురవేసింది. విజేత జట్టును సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ అభినందించి ట్రోఫీని అందజేశారు.

బైక్‌ల పరస్పర ఢీ - ఇద్దరి మృతి

• మృతుల్లో ఒకరు ఉప సర్పంచ్

కొత్తచెరువు: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కొడపగానిపల్లి పంచాయతీ ఉపసర్పంచ్, వేములేటిపల్లికి చెందిన చెరువుకొళ్ల నాగరాజు (40) వ్యక్తిగత పనిపై ఆదివారం కొత్తచెరువుకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన కొత్తచెరువు మండలం మైలేపల్లి వద్దకు చేరుకోగానే మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎదురుగా వేగంగా ద్విచక్రవాహనంపై వస్తున్న ధర్మవరం పట్టణానికి చెందిన మంజునాథ్ (22) ఢీకొన్నాడు. ఘటనలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మంజునాథ్‌కు తీవ్ర గాయాలు, అతనితోపాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మంజునాథ్ మృతి చెందాడు. ఘటనపై కొత్తచెరువు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కంటైనర్ - కారు ఢీ


గాయపడిన చిన్నారి, మహిళ

కూడేరు: మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం కంటైనర్, కారు ఢీకొన్నాయి. కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న మహేష్ ఆయన భార్య, కుమార్తె గాయపడ్డారు. విడపకల్లు మండలం గడేహోతురుకు చెందిన వీరు కారులో బెంగళూరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వివాహితపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్

అనంతపురం: కట్టుకున్న భార్యనే చంపాలని ప్రయత్నం చేసిన భర్త కటకటాలపాలయ్యాడు. వివరాలను అనంతపురం వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం వెల్లడించారు. అనంతపురం నగరంలోని పవర్ ఆఫీసు వెనుక అంబేడ్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఖాజీ తస్లీమా నస్రీన్‌కు ఏడు నెలల క్రితం సంగమేష్ నగర్‌లోని బృహస్పతి పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న కె.రోషన్ జమీర్ ఖాన్‌తో వివాహమైంది. వీరిద్దరిదీ రెండో వివాహమే. పెద్దల సమక్షంలో పెళ్లి చేసే సమయంలో తస్లీమా నస్రీన్ తల్లిదండ్రులు రూ.5 లక్షల నగదు, 12 తులాల బంగారు, రూ.1.50 లక్షల విలువ చేసే ఫర్నీచర్‌ను ఇచ్చారు. వివాహం జరిగినప్పటి నుంచి రోషన్ జమీర్ , అతని తల్లి షమీమ్ భాను, చెల్లెలు నౌజియా సుల్తానా, ఆమె భర్త సలీం, మేనమామ సాదిక్ వలి అందరూ కలిసి మరో రూ.10 లక్షలు కట్నం కింద తీసుకురావాలని ఒత్తిడి చేసేవారు. ఇందుకు నస్రీన్ ఒప్పుకోకపోవడంతో ఈ నెల 15న మోతాదుకు మించి టాబ్లెట్‌లను నీటిలో కలిపి బలవంతంగా నస్రీన్ నోట్లోకి రోషన్ జమీర్ పోసి నోరు అదిమి పెట్టాడు. తర్వాత అపస్మారక స్థితికి చేరుకున్న నస్రీన్‌ను పొరుగింటి వారు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త రోషన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి, ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేశారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నాశనం

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహిస్తున్న కూటమి సర్కార్
- విద్యా సదస్సులో ఎమ్మెల్సీ గోపిమూర్తి ధ్వజం



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి

ఉరవకొండ: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా విద్యావ్యవస్థ నాశనమైందని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలతో పూర్తిగా భ్రష్టుపట్టిందని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపి మూర్తి ధ్వజమెత్తారు. ఉరవకొండలోని గవిమఠం వెనుక ఉన్న సీవీవీ నగర్‌లో యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు రామప్పచౌదరి అధ్యక్షతన నిర్వహించిన విద్యాసదస్సులో గోపి మూర్తి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగంలో ఏదో ఒక సంక్షోభాన్ని ఎదుర్కొంటూనే ఉందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టం పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం గణనీయంగా పడిపోయేలా చేశారన్నారు. రాష్ట్రంలో 9 రకాల పాఠశాలల నిర్వహణ లాంటి అశాస్త్రీయ కార్యక్రమాలతో తీవ్ర గందగోళానికి తెర లేపారన్నారు. రాష్ట్రంలో 4వేల పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు ఉన్నాయంటే ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టకుండా యోగా డే, మెగా పేరెంట్స్ డే అంటూ వారాల పాటు కార్యక్రమాలు నిర్వహించి ఫొటోలు తీయడం, అప్‌లోడ్ చేయడమే పనిగా ఉపాధ్యాయులను ఆదేశించడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్సీ యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. యూటీఎఫ్ ఆవిర్భావం, విధి విధానాలను వివరించారు. యూటీఎఫ్ అలుపెరుగని పోరాటాల ఫలితంగా ఉపాధ్యాయ సమస్యలు విజయవంతంగా పరిష్కారమయ్యాయన్నారు. కార్యక్రమంలో వజ్రకరూరు ఎంఈఓలు ఎర్రిస్వామి, తిమ్మప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, పూర్వ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, విద్యావేత్త షాషావలి, ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన సత్యసాయి యూనిటీ క్రికెట్ టోర్నీ


యూనిటీ కప్-2025ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: సత్యసాయి శత జయంతిని పురస్కరించుకుని ప్రారంభించిన శ్రీసత్యసాయి యూనిటీ క్రికెట్ టోర్నీ-2025 ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. మూడు నెలల పాటు దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాలలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. హరియాణ వర్సెస్ గోవా జట్ల మధ్య ఆదివారం ఫైనల్ మ్యాచ్ పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో జరిగింది. అయితే వర్షం కారణంగా మ్యాచ్ పూర్తిగా జరగకపోవడంతో అంపైర్లు డ్రాగా ప్రకటించారు. ఇరు జట్లను విజేతలుగా ప్రకటిస్తూ కప్‌ను అందజేశారు. అంతకు ముందు ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి, ప్రముఖ విశ్రాంత క్రికెటర్లు మురళీకార్తీక్, రణతుంగ, కాళీ చరణ్‌తో కలసి యూనిటీ కప్‌ను ఆవిష్కరించారు. అనంతరం క్రికెటర్‌లను సన్మానించారు. సాయంత్రం సత్యసాయి సేవా సంస్థల నేషనల్ యూత్ సంగీత కచేరీ అలరించింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

హిందూపురం: పట్టణంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న టీచర్స్ కాలనీలో నివాసముంటున్న మహబూబ్ బాషా ఇంట్లో చోరీ జరిగింది. శనివారం ఇంటికి తాళం వేసి ముక్కిడిపేటలో బంధువుల ఇంట ఫంక్షన్‌కు కుటుంబంతో కలసి వెళ్లారు. రాత్రి అక్కడే ఉండిపోయారు. ఆదివారం ఉదయాన్నే ఇంటి తలుపులు తీసి ఉన్నాయంటూ పక్కింటి వారు ఫోన్ చేయడంతో వెళ్లి పరిశీలించారు. బీరువాలోని రూ.2లక్షల నగదు, బంగారు నగలు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై హిందూపురం రెండో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఐదుగురి అరెస్ట్

సోమందేపల్లి: విద్యుత్ తీగలు అపహరించుకెళుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పెనుకొండ డీఎస్పీ నర్శింగప్ప తెలిపారు. ఆదివారం సోమందేపల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. పట్టుబడిన వారిలో బ్రాహ్మణపల్లికు చెందిన అభిలాష్, షబ్బీర్, జమీర్, జిలాన్, భక్తర్ ఉన్నారు. వీరు కొంత కాలంగా రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ ప్రాంతాల్లో విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలోని తీగలను అపహరించుకెళ్లేవారు. ఆయా ఘటనపై కేసులు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను ఆదివారం అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.6.50 లక్షల విలువ చేసే విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


అక్కులప్ప (ఫైల్)

కనగానపల్లి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం తూంచర్ల గ్రామానికి చెందిన బండి అక్కులప్ప (62)కు భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తాను సాగు చేసిన వరి పంటకు నీరు పెట్టేందుకు ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. అప్పటికే కురుస్తున్న జడి వానకు పెట్టె పూర్తిగా తడిసి కరెంట్ సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని గుర్తించక స్టార్టర్ పెట్టెను తెరవబోతుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు గుర్తించి వెంటనే విద్యుత్ సరఫరా ఆపి అతనిని కాపాడేలోపు ప్రాణాలు కోల్పోయాడు. ఘటనతో తూంచర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి దుర్మరణం


షాకీర్ (ఫైల్)

నల్లచెరువు: మండల పరిధిలోని పాత రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో కె. పూలకుంట గ్రామానికి చెందిన షాకీర్(38) దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు.. ఆటోలో కూరగాయలు తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న షాకీర్.. కూరగాయల కోసమని ఆదివారం తెల్లవారుజాము ఆటోలో గ్రామం నుంచి కదిరికి బయలుదేరాడు. పాత రైల్వే స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా దూసుకొచ్చిన కారును తప్పించబోయి ముందున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షాకీర్‌ను స్థానికులు వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేడు ‘పరిష్కార వేదిక’

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్పీ వి.రత్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును వెంట తీసుకెళ్లాలి.

సెల్‌ఫోన్ కోసం భార్యతో గొడవ - యువకుడి ఆత్మహత్య

చిలమత్తూరు: సెల్‌ఫోన్ కోసం భార్యతో గొడవ పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ఝూర్ఖండ్‌కు చెందిన ఆనంద్ సర్దార్ (20) బతుకు తెరువు కోసం వలస వచ్చి చిలమత్తూరు మండలం దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని యగ్నిశెట్టిపల్లి వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. సెల్‌ఫోన్ కొనుగోలు విషయంలో శనివారం రాత్రి భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వచ్చి నేరుగా తాను పనిచేస్తున్న పాక్టరీపారం ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మహిళ మృతి


మృతురాలు

బత్తలపల్లి: స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న నాగుల కట్ట వద్ద ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సోమశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మతిస్థిమితం సరిగాలేని సుమారు 65 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ మహిళ నాగలకట్ట మీద గత 20 రోజులుగా ఉండేదని స్థానికులు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతుండేదన్నారు. గమనించిన చుట్టు పక్కల వారు ఆమెకు ఆహారం ఇచ్చి సొకర్యాలు కల్పించేవారన్నారు. ఆదివారం ఉదయం ఆహారం ఇచ్చేందుకు వెళ్లినప్పుడు అచేతనంగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు వివరించారు. గుర్తు తెలియని మహిళ మృతి కింద కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96833 కు సమాచారం అందించాలని కోరారు.

ఉచిత బస్సు.. తుస్సు

- సరిహద్దు గ్రామాల మహిళలకు నిరాశ
- గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రయోజనం శూన్యం


బొమ్మనహాళ్ మీదుగా వెళుతున్న అంతర్రాష్ట్ర సర్వీసు బస్సు

బొమ్మనహాళ్: ఉచిత బస్సు ప్రయాణం గ్రామీణ ప్రాంత మహిళలకు వర్తించడం లేదు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో లాంటి ఐదు రకాల బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కర్ణాటక సరిహద్దున ఉన్న బొమ్మనహాళ్ మండలంలోని గ్రామాల మహిళలకు తీరని కలగానే మిగులుతోంది. బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ గ్రామాల్లో ఉన్న బ్యాంకులకు, ప్రభుత్వ కార్యాలయాలకు, కళ్యాణదుర్గంలో ఉన్న ఆర్డీటీ ఆస్పత్రికి రోజూ మహిళలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ మార్గంలో తిరిగే బస్సులన్నీ పొరుగున ఉన్న కర్ణాటకకు వెళ్లి వస్తుంటాయి. మండలంలోని గోనేహాళ్, క్రాస్ నుంచి బొమ్మనహాళ్‌కు వెళ్లాలంటే మహిళలు టికెట్ తీసుకోవాల్సిందేనని కండక్టర్లు అంటున్నారు. అంతర్రాష్ట్ర సర్వీసు బస్సులకు ఉచిత ప్రయాణం కల్పించలేదని స్పష్టం చేస్తున్నారు. బొమ్మనహాళ్ నుంచి కళ్యాణదుర్గం వెళ్లాలన్నా టికెట్ తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు. ఉచిత బస్సు అంటూ కర్ణాటక ప్రాంత సరిహద్దున ఉన్న తమకు అన్యాయం చేశారంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జటాయువు పక్షి విగ్రహం వద్ద పర్యాటకుల సందడి


హ్యాండీ క్రాఫ్ట్స్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్న పర్యాటకులు

• లేపాక్షిలో పర్యాటకుల సందడి

పర్యాటక కేంద్రం లేపాక్షిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పర్యాటకులు, భక్తులతో ఆలయం కిటకిటలాడింది. నంది విగ్రహం, థీం పార్క్, విరుపన్న, వీరన్న పార్కులు, వీరభద్రస్వామి ఆలయం, ఏడుశిరస్సుల నాగేంద్రుని విగ్రహం వద్ద ఫొటోలు, వీడియోలతో సందడి చేశారు. ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను ఆసక్తి తిలకించారు. – లేపాక్షి:


వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు